సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 20 । అక్టోబర్ । 2024



వేగవంతం చేయాలి

జిల్లాలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

- 8లో ▸



తడిసిన ధాన్యం

సిరికొండ మండలంలోని రావుట్ల, న్యావనంది గ్రామాల్లో శనివారం వర్షం పడింది. ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
39.1 /22.0

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జీజీహెచ్ నుంచి బాలుడి కిడ్నాప్



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుంచి ఏడాది వయసున్న బాలుడిని కిడ్నాప్ చేయడం కలకలం రేపింది. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12.25 గంటల ప్రాంతంలో ముగ్గురు మహిళలు బాలుడిని ఎత్తుకెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డి జిల్లా మద్నూర్‌కు చెందిన లక్ష్మి అనారోగ్యంతో జిల్లా జనరల్ ఆస్పత్రిలో వైద్యం కోసం వచ్చింది. భార్యతో పాటు భర్త రాజు తన కొడుకు మణికంఠతో కలిసి ఆస్పత్రిలో నిద్రించారు. గుర్తు తెలియని మహిళలు మణికంఠను ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం 6 గంటలకు నిద్రలేచిన రాజు తన కొడుకు పక్కన లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. ఒకటో టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు జీజీహెచ్‌లోని సీసీ కెమెరాలు పరిశీలించగా ముగ్గురు మహిళలు కలిసి బాలుడిని ఎత్తుకెళ్తున్న దృశ్యాలు కనిపించాయి.

ఇది రెండో ఘటన

ప్రభుత్వ ఆస్పత్రిలో బాలుడి కిడ్నాప్ ఇది రెండో ఘటన. కొన్ని నెలల క్రితం ఓ బాలుడిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సెక్యూరిటీ, సీసీఎస్ బలగాలు, పోలీసులు ఉన్నా చిన్నపిల్లల కిడ్నాప్‌లు జరుగుతూనే ఉన్నాయి. దీంతో పాటు పలువురు రోగులు సైతం ఆస్పత్రి నుంచి అదృశ్యం అవుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

పశువులకు టీకాలు వేయించాలి



నిజామాబాద్ రూరల్: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి జగన్నాథాచారి సూచించారు. మండలంలోని పాల్దా గ్రామంలో శనివారం పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి రైతులు పశువుల దాణాగా అజొల్లా సాగు చేసుకోవాలని సూచించారు. దీంతో దాణా ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలిపారు. అజోల్లా ఒక రకమైన నాచు మొక్క అని చెప్పారు. దీనిని దాణగా పెడితే పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. పాల్దా, తిర్మన్‌పల్లి గ్రామాల్లో 758 పశువులకు టీకాలు వేసినట్లు మండల పశువైద్య అధికారి బాబురావు తెలిపారు. భాస్కర్, సత్యలింగం, శ్రీనివాస్, సజ్జద్, యూసఫ్ పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులను అరికట్టాలి



నిజామాబాద్ రూరల్: హిందూ దేవాలయాలపై దాడులను అరికట్టాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాకూర్ అన్నారు. శనివారం నగరంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద హిందూ సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ.. సికింద్రాబాద్‌లో ముత్యాలమ్మ ఆలయంపై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హిందు వ్యతిరేక శక్తుల దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఆర్డీవోకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో తమ్మల కృష్ణ, గాజుల దయానంద్, దాత్రిక రమేష్, నాంపల్లి శేఖర్, కోడిమల శ్రీనివాస్, రాంప్రసాద్ చటర్జీ, అఖిల్, ఇందూరు సురేష్, పాతూరి మహేష్, సాయి, గజానన్, బాబు, అర్జున్ రెడ్డి, ప్రణయ్ పాల్గొన్నారు.


రేపు ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు

నిజామాబాద్ నాగారం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీఐఈవో రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-19 విభాగంలో బాలబాలికలకు ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపికలు నాగారంలోని రాజారాం స్టేడియంలో ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 10 గంటలకు పీడీ ప్రసాద్‌కు రిపోర్టు చేయాలని సూచించారు.

సలాం.. పోలీస్

విధి నిర్వహణలో అసువులు బాసిన వారెందరో..

- నక్సలైట్ల కాల్పుల్లో పలువురి మృతి
- రేపు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం



పోలీస్ అమరవీరుల స్మారక స్తూపం

సండే స్పెషల్

ఖలీల్‌వాడి: ప్రజలంతా నిద్రలో ఉంటే వారు మాత్రం మేల్కొని శాంతి భద్రతలు పరిరక్షిస్తారు.. పండుగల సమయంలో అందరు ఇంట్లో ఆనందంగా గడిపితే పోలీసులు మాత్రం విధుల్లో ఉండి ప్రజలను కాపాడతారు. ఎండ.. వాన.. పగలు.. రాత్రి లెక్క చేయకుండా నిత్యం విధుల్లో ఉంటారు.. ఇలా విధులు నిర్వహిస్తూ ఎందరో పోలీసులు అమరులయ్యారు. విధి నిర్వహణలో చనిపోయిన పోలీసులను స్మరించుకోవడానికి ఏటా అక్టోబర్ 21న పోలీస్ అమరుల సంస్మరణ దినం నిర్వహిస్తున్నారు. అయితే ఎంతోమంది పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారు. జిల్లాలో నక్సలైట్ల దాడుల్లో పలువురు మృతి చెందారు. వారి సేవలను స్మరించుకుంటూ ఆయా కుటుంబాలు అండగా ఉంటామని పోలీస్ అధికారులు భరోసా కల్పిస్తున్నారు.

వరుస ఘటనలతో పోలీసుల అలర్ట్

గతంలో జిల్లాలోని మారుమూల ప్రాంతాలు నక్సల్స్‌కు షెల్టర్ జోన్‌లుగా ఉండేవి. దీంతో పోలీసులపై వారు దాడులు చేసేవారు. వరుస ఘటనల్లో సిబ్బంది చనిపోవడంతో పోలీసులు శాఖ అప్రమత్తం అయింది. పోలీసులు నక్సల్స్ కదిలికలపై నిఘా పెంచారు. అదే సమయంలో మావోయిస్టులు ప్రజలను ఇన్‌ఫార్మర్ల పేరుతో హతమార్చడంతో ప్రజల్లో వారిపై విశ్వాసం పోయింది. పోలీసులు గ్రామీణ ప్రజలతో మమేకమై వారిని చైతన్యం చేయడానికి కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో పోలీసులు గ్రామీణ ప్రాంతంలో పట్టుసాధించడంతో నక్సల్స్ అడవి బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనంతరం 2005 మానాల ఎన్‌కౌంటర్ తర్వాత జిల్లాలో మవోయిస్టు ప్రాబల్యం తగ్గింది.

ఈనెల 31 వరకు కార్యక్రమాలు

పోలీస్ అమరుల సంస్మరణ దినం సందర్భంగా ఈ నెల 21 నుంచి 31 వరకు జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 21న అమర వీరుల దినోత్సవం నిర్వహించి, నివాళులు అర్పిస్తారు. అనంతరం క్యాండిల్ ర్యాలీలు, ద్విచక్ర వాహనాలతో ర్యాలీలు తీయనున్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిం పోటీలు, ఉచిత రక్తదాన శిబిరం, జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించనున్నారు. పోలీస్ కళా బృందంతోపాటు పోలీస్ బ్యాండ్ ద్వారా రద్దీ ప్రాంతాల్లో కార్యక్రమాల నిర్వహణ, సినిమా థియేటర్స్‌లో స్లైడ్స్ ద్వారా ప్రచారం చేయడానికి పోలీస్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

నక్సల్స్ దాడుల్లో మృతి చెందిన పోలీసులు

- 1986 జనవరి 2న గోకుల్ తండా సమీపంలో నక్సల్స్, పోలీసులకు మధ్య జరిగిన కాల్పుల్లో ఏడో బెటాలియన్‌కు చెందిన హెచ్ బిన్నిశ్వర్‌రావు మృతి చెందారు.
- భీమ్‌గల్ మండలంలో పల్లికొండలో రాత్రివేళ పెళ్లికి వెళ్లిన కానిస్టేబుల్ కుతుబుద్దీన్‌ను 1989లో నక్సల్స్ కాల్చివేశారు.
- 1992 ఫిబ్రవరి 7న రామారెడ్డి శివారులో జరిగిన కాల్పుల్లో ఏడో బెటాలియన్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ టి దేవిదాస్, కానిస్టేబుళ్లు సుంకన్న, బాబర్ అలీ మృతి చెందారు.
- 1996 మే 2న పార్లమెంట్ ఎన్నికల సమయంలో రావుట్ల, న్యావనంది గ్రామాల్లో పోలింగ్ బాక్స్‌ను నక్సల్స్ ఎత్తుకెళ్లారు. ఘటన స్థలానికి వెళ్తున్న సమయంలో కంకర కుప్పల్లో క్లెమోర్‌మైన్స్ పేల్చడంతో ఎస్సై విక్టర్ మృతి చెందగా కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి.
- 1996 నవంబర్ 15న ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన కాల్పుల్లో ఏడో బెటాలియన్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుళ్లు గులామ్ రసూల్, ఎం సుభాష్ చంద్రబోస్, ఎస్ ఇషాయ్య, జె జవహర్‌లాల్ తోపాటు కానిస్టేబుళ్లు కె మారుతిరావు, జె వాసు, కె వేణు చనిపోయారు.
- 1996లో నిజామాబాద్‌లో డీసీసీబీ చైర్మన్ వీజీ గౌడ్ గన్‌మెన్ గంగాధర్‌ను నక్సల్స్ కాల్చివేశారు.
- భీమ్‌గల్ పాత బస్టాండ్ వద్ద నక్సల్స్ కాల్పుల్లో కానిస్టేబుల్ జహంగీర్ గాయపడ్డారు.
- డిచ్‌పల్లి మండలం సుద్దులం, యానంపల్లి గ్రామంలో మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో పోలీస్ వాహనంలో ప్రయాణిస్తున్న ఎస్సైతోపాటు ఐదుగురు కానిస్టేబుళ్లు మృతి చెందారు.
- 2000లో మాక్లూర్ పోలీస్‌స్టేషన్ ఏఎస్సై ఎన్‌కౌంటర్‌లో మరణించారు.

మక్కల ధర పతనం

- క్వింటాలు రేటు రూ.2,150
- మార్కెట్‌లోకి ఒకేసారి మక్కలు ఎక్కువ రావడంతో తగ్గిన డిమాండ్
- సిండికేట్ వ్యాపారులు ధర తగ్గించారంటున్న రైతులు



మోర్తాడ్‌లో ఆరబోసిన మక్కలు

మోర్తాడ్: మక్కల ధర పతనమైంది. నిన్న మొన్నటి వరకు క్వింటాలుకు రూ.2,400 నుంచి రూ.2,600 వరకు లభించిన ధర ఒకేసారి రూ.2,150కి చేరింది. మార్కెట్‌లోకి ఒకేసారి ఎక్కువ మొత్తంలో మక్కలు రావడంతో డిమాండ్ తగ్గి ధర పతనమైందని వ్యాపారులు చెబుతున్నారు. రైతులు మాత్రం సిండికేట్ మూలంగానే తమ మక్కలకు ధర లేకుండా పోయిందని వ్యాఖ్యానిస్తున్నారు. వర్షాకాలం సీజనులో సోయాకంటే ఎక్కువ ప్రాధాన్యత మొక్కజొన్నకు ఇచ్చిన రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. యాసంగి సీజనులో సాగు చేసిన మక్కలకు క్వింటాలుకు రూ.3 వేల వరకు ధర లభించడంతో ఈసీజనులో కూడా అదే ధర లభిస్తుందని ఆశించారు. మక్కల క్రయ విక్రయాలు ఆరంభమైన మొదట్లో రూ.2,600 వరకు ధర లభించింది. కొనుగోలు కేంద్రాల్లోని మద్దతు ధర కంటే ఎక్కువ ధర వ్యాపారులే చెల్లించడంతో రైతులు మార్కెట్‌లోనే విక్రయించారు. మన ప్రాంతంలో సాగైన మక్కలకు నాణ్యత ఉండటంతో మహారాష్ట్ర, గుజరాత్‌లకు ఎగుమతి అయ్యాయి. ఎగుమతులు జోరుగా సాగిన సమయంలో ధర ఆశించిన విధంగానే లభించింది. దసరా పండుగ సందర్భంలో కొంత విరామం ఏర్పడగా మళ్లీ మక్కల కొనుగోలు పుంజుకుంది. ధర మాత్రం పడిపోవడంతో ఆఖరి సమయంలో విక్రయిస్తున్న రైతులకు ఆశించిన ధర లేకుండా పోయింది. మొదట్లో మక్కలను విక్రయించిన వారికి గిట్టుబాటు కాగా ఇప్పుడు తూకం వేయిస్తున్న రైతులకు ధర పడిపోయి లాభాలు తగ్గాయి.

వ్యాపారులు చెప్పిన ధరకే అమ్ముకుంటున్నాం



మక్కల విషయంలో వ్యాపారుల మాటనే నెగ్గుతుంది. వారు ఎంత చెబితే అదే ధరకు విక్రయించాల్సి వస్తుంది. మక్కలకు డిమాండ్ ఉన్నా వ్యాపారులు సిండికేట్ కావడం వల్లనే ధర పడిపోయి రైతులకు లాభాలు తగ్గిపోతున్నాయి. రైతుల పరిస్థితి బాగుండాలంటే మక్కలకు ధర పెరుగాలి.

– జైడి చిన్నారెడ్డి, రైతు, మోర్తాడ్

ఎస్సీ వర్గీకరణకు ఒప్పుకోం



అభివాదం చేస్తున్న మాల మహానాడు జాతీయ కన్వీనర్ చెన్నయ్య, నాయకులు

మాలమహానాడు జాతీయ కన్వీనర్ చెన్నయ్య

నిజామాబాద్ నాగారం: ఎస్సీ వర్గీకరణను ఒప్పుకునేది లేదని, అవసరమైతే మాలలు అందరు త్యాగాలు చేయడానికి సిద్ధంగా ఉండాలని మాల మహానాడు జాతీయ కన్వీనర్ చెన్నయ్య అన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి బస్సు యాత్రలో భాగంగా శనివారం నగరంలోని న్యూ అంబేడ్కర్ భవనంలో ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకుల సమావేశం గైని గంగారాం అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చెన్నయ్య మాట్లాడారు. మాలలకు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రలను ప్రజలకు వివరించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వర్గీకరణపై ఉన్న ఆసక్తి.. దళిత డిక్లరేషన్, సంక్షేమ అభివృద్ధి పథకాల అమలుపై ఎందుకు లేదని ప్రశ్నించారు. మాలలకు నామినేటెడ్ పోస్టులలో కూడా అన్యాయం జరిగిందన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా నవంబర్ 24న హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు తాళ్లపెల్లి రవి, బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, నల్లాల కనకరాజు, చెరుకు రాంచందర్, ఎరమల రాములు, కరణం కిషన్, చెన్నకేశవులు, ఎడ్ల నాగరాజు, ఆనంపల్లి ఎల్లన్న, స్వామిదాస్, దేవివాస్, మోహన్‌రావు, విజయ్, జైపాల్, సుశాంత్ పాల్గొన్నారు.

అనాథల కోసం ట్రస్ట్ అభినందనీయం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, చిత్రంలో జిల్లా జడ్జి సునీత, సీపీ కల్మేశ్వర్

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

ఖలీల్‌వాడి: అనాథ బాలలకు నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భవిష్య జ్యోతి ట్రస్ట్‌ను నెల కొల్పడం అభినందనీయమని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. శనివారం కోర్టు భవన సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ట్రస్ట్ ప్రారంభోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. ట్రస్ట్‌కు దాతలు విరాళాలు అందించాలని పిలుపునిచ్చారు. ట్రస్ట్‌కు జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. అనాథ బాలలకు ఉచితంగా ప్రవేశాలు కల్పించిన కాకతీయ స్కూల్, రవి పబ్లిక్ స్కూల్, నిర్మల హృదయ్ పాఠశాలల యాజమాన్యాలను కలెక్టర్ అభినందించారు. జిల్లా జడ్జి కుంచాల సునీత మాట్లాడుతూ.. జిల్లాలోని బాలసదన్‌లో ఆశ్రయం పొందుతున్న అనాథలకు నాణ్యమైన విద్యను ఇప్పిస్తూ, వారికి అన్ని విధాలుగా తోడ్పాటుగా నిలవాలనే ఆశయంతో భవిష్య జ్యోతి ట్రస్ట్ ఏర్పాటు చేశామన్నారు. చదువుతో పాటు వారికి అవసరమైన ఇతర సదుపాయాలన్నీ ట్రస్ట్ ద్వారా సమకూరుస్తామన్నారు. నలుగురు అనాథ బాలలను సీపీ కల్మేశ్వర్ దత్తత తీసుకున్నారని తెలిపారు. ఆయన సేవా దృక్పథాన్ని అభినందించారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ అనాథ బాలలను దత్తత తీసుకునే అవకాశం కలగడాన్ని తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తాను బదిలీపై వెళ్తున్నప్పటికీ దత్తత తీసుకున్న బాలలకు తనవంతు తోడ్పాటును అందిస్తుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిచ్‌పల్లి బెటాలియన్ కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని, సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీనివాస్, ప్రైవేట్ విద్యా సంస్థల నిర్వాహకులు రజనీకాంత్, సరళా మహేందర్ పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల మెరుపు దాడులు

- వంశీ, లహరి హోటళ్లలో తనిఖీలు
- ఢిల్లీవాలా స్వీట్‌హోం, మసాలా కేంద్రాలలోనూ..
- స్టార్ హోటళ్లలో కుళ్లిన ఆహార పదార్థాలు స్వాధీనం
- పలు హోటళ్లకు నోటీసులు జారీ



నగరంలోని ఓ హోటల్‌లో శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు

నిజామాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని పలు స్టార్ హోటళ్లు, ఆహార పదార్థాల తయారీ కేంద్రాలపై ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్సు బృందం సభ్యులు మెరుపు దాడులు చేశారు. కుళ్లిన మాంసం, ఇతర ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. శనివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి వచ్చిన ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్సు స్పెషల్ బృందం, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో నగరంలో పలుచోట్ల దాడులు జరిపారు. ప్రముఖ స్టార్ హోటళ్లు లహరి, వంశీ ఇంటర్నేషనల్ హోటల్స్‌ల్లో తనిఖీలు జరిపారు. లహరి హోటల్‌లో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు పాటించకపోవడం, ప్లాస్టిక్ కవర్లలో కుళ్లిన మాంసం, హానికర రంగులు కలిపిన చికెన్‌తోపాటు రూ. 24,200 విలువ కలిగిన మసాలా, మిర్చి పేస్టులల్లో ఫంగస్, బూజు పట్టిన కూరగాయలను గుర్తించారు. మాంసపు పదార్థాలను ధ్వంసం చేసి నోటీసులు జారీచేశారు. వంశీ ఇంటర్నేషనల్ హోటల్‌లో హానికరమైన రంగులతో కూడిన మాంసపు ఉత్పత్తులు, ఉడకబెట్టిన మిర్చి పేస్ట్, కాలం చెల్లిన మసాలాపొడులు గుర్తించారు. కిచెన్‌లో సరియైన గాలి, వెలుతురు లేకపోవడం, అపరిశుభ్రంగా ఉండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమానాస్పద శాంపుల్స్ ని సేకరించారు. అనంతరం మిర్చి కాంపౌండ్ లో పలు మసాలా కారం, పసుపు తయారీ కేంద్రాలపై దాడులు, తనిఖీలు చేశారు. శాంపుల్స్ సేకరించి ల్యాబ్‌కు తరలించారు. రాష్ట్రపతి రోడ్‌లోని ప్రముఖ మిఠాయి దుకాణం ఢిల్లీవాలా స్వీట్ హౌస్‌లో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. అపరిశుభ్ర వాతావరణం చూసి అధికారులు విస్తుపోయారు. స్వీట్ హౌస్ యాజమాన్యంపై టాస్క్‌ఫోర్స్ టీంహెడ్ ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు నోటీసులు జారీ చేశారు. స్వీట్ హోంలో తయారైన పదార్థాలు లాబ్‌కు తరలించారు. అనంతరం టాస్క్‌ఫోర్స్ హెడ్ జ్యోతిర్మయి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిని ఉపేక్షించబోమన్నారు. ఆహారపదార్థాల్లో కల్తీ, నాసిరకమైన పదార్థాలు వాడటం, కుళ్లిన మాంసం, మసాలాలు వాడటం, వంటగది అపరిశుభ్రంగా ఉండటం వంటి అనేక అంశాల తన దృష్టికి వచ్చాయని తెలిపారు. ఇకపై ఆహారతయారీదారులు, హోటళ్ల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటివారినైనా విడచిపెట్టననివారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదుచేస్తామని హెచ్చరించారు. ఈ టాస్క్ ఫోర్స్ దాడులలో అధికారులతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్

- రైతు డిక్లరేషన్ అమలు చేయకుంటే భరతం పడతారు
- హైడ్రా, మూసీ ఆక్రమణల కూల్చివేతలపై ఉద్యమిస్తాం
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, చిత్రంలో ఎమ్మెల్యే ధన్‌పాల్, దినేశ్, గంగారెడ్డి

సుభాష్‌నగర్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, అన్నివర్గాలను మోసం చేసి అధికారంలోకి రావడంలో సీఎం రేవంత్‌రెడ్డి సక్సెస్ అయ్యారని మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ సభ్యత్వ నమోదుపై సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఈటల మీడియాతో మాట్లాడారు. రైతు రుణమాఫీపై సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత తొలి సంతకం పెడతానన్న రేవంత్‌రెడ్డి మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతు డిక్లరేషన్‌లో ఏం మాట్లాడారో వాటిని అమలు చేయాలని డిమాండ్‌చేశారు. రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయని పక్షంలో వారే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ భరతం పట్టడం ఖాయమన్నారు. సదరం క్యాంపుల్లో 40 శాతం లోపు సర్టిఫికెట్లు ఇస్తూ ఉన్న పింఛన్లు తొలగిస్తున్నారని అన్నారు. వీరితోపాటు కొత్తగా ఒంటరి మహిళలు, వితంతు, వృద్ధాప్య పింఛన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. పింఛన్‌ను రూ.4 వేలకు పెంచి ఇస్తామని చెప్పి ఏడాది కావస్తున్నా దిక్కులేదన్నారు. గృహలక్ష్మీ పథకంపై మహిళలు దుమ్మెత్తి పోస్తున్నారని, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులను ప్రజలు గ్రామాల్లో అడుగు పెట్టనివ్వరని హెచ్చరించారు.

జీవో 29ను సవరించాలి..

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 29ని సవరించి స్పష్టత వచ్చే వరకూ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను తాత్కాలికంగా వాయిదా వేయాలని ఈటల రాజేందర్ డిమాండ్‌చేశారు. అభ్యర్థుల ఆందోళనకు బీజేపీ మద్దతు ఇస్తుందని, వారిపై లాఠీచార్జి, అరెస్టులు, అక్రమ కేసులు పెట్టడం, బండి సంజయ్, ఇతర నాయకులను అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం తెచ్చిన దుర్మార్గమైన జీవో 29ను వాపస్ తీసుకోవాలన్నారు. మూసీ నది సుందరీకరణ, పునరుజ్జీవనం పేరుతో రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేయాలని చూస్తోందని, సీఎం రేవంత్‌రెడ్డి బుకాయించడం మానేసి, మూసీ ఆక్రమణలు కూల్చడం ఆపేయాలని డిమాండ్‌చేశారు. హైడ్రా, మూసీ ఆక్రమణల కూల్చివేత వంటి సమస్యలపై భవిష్యత్‌లో పెద్ద ఉద్యమం తీసుకుంటామన్నారు. బీఆర్‌ఎస్ అనేక మాటలు చెప్పి మోసం చేసిందని బొందపెట్టామని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో రెండు పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్తారని, మోదీ నాయకత్వంలో ఇచ్చిన మాటలకు కట్టుబడి బీజేపీ పని చేస్తుందన్నారు. ప్రజలు బీజేపీని ఆదరించి ఆశీర్వదించాలని, స్వచ్ఛందంగా బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదు మరింత వేగవంతం చేయాలని, అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లతో 50 శాతమైనా సభ్యత్వం తీసుకునేలా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని ఈటల రాజేందర్ సూచించారు. పార్టీ సభ్యత్వం, నిర్మాణం, కమిటీలు, ఐక్యత ఉన్నప్పుడే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలిచే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, సభ్యత్వ నమోదు కన్వీనర్ పుప్పాల శివరాజ్, కో కన్వీనర్ సవిత, నాయకులు గద్దె భూమన్న, న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, స్వామి యాదవ్, గంగోనె సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేజీబీవీలో ట్రెయినీ కలెక్టర్ విచారణ



మాక్లూర్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇటీవల చోటు చేసుకున్న వరుస ఘటనలపై ట్రెయినీ కలెక్టర్, మాక్లూర్ ఇన్‌చార్జి ఎంపీడీవో సంకేత్‌కుమార్ శనివారం విచారణ చేపట్టారు. ప్రత్యేకాధికారిణి తమను అసభ్య పదజాలంతో దూషిస్తోందని ఉపాధ్యాయినులు పదిహేను రోజుల క్రితం డీఈవోకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో తన వ్యవహార శైలిని మార్చుకుంటానని ఉన్నతాధికారితో చెప్పి విధుల్లో చేరారు. ఈ నెల 18న పాఠశాలలోని ఓ ఉపాధ్యాయురాలు తన బంగారు గొలుసు పోవడంతో ఆరో తరగతి చదువుతున్న బాలికను అనుమానించి భూత వైద్యుడి వద్దకు తీసుకెళ్లిన ఘటన వెలుగుచూడడంతో ట్రెయినీ కలెక్టర్ విచారణ చేపట్టారు. ఆయన వెంట డీఈసీవో భాగ్యలక్ష్మి, మండల విద్యాధికారి సత్యనారాయణ, ఎంపీవో టి శ్రీనివాస్ తదితరులున్నారు.

టీ హబ్‌లో షార్ట్‌సర్క్యూట్



నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలోని టీ హబ్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగింది. శనివారం టీ హబ్ సెంటర్‌లో ఓల్టేజ్ ఎక్కువ కావడంతోనే షార్ట్ సర్క్యూట్ అయిందని హబ్ ఇన్‌చార్జి దివ్య తెలిపారు. ఏసీలో స్వల్పంగా మంటలు రావడంతో సిబ్బంది అప్రమత్తమై వెంటనే ఆర్పేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఐటీఐ ప్రవేశాల గడువు పెంపు

నిజామాబాద్‌అర్బన్: ఐటీఐలో ప్రవేశాలకు గడువు పెంచినట్లు నగరంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ యాదగిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7 ఫేజ్‌లో భాగంగా అడ్మిషన్లను ఈ నెల 30వ తేదీ వరకు పెంచినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే వారు తమ పదోతరగతి మెమో, బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుల్లో వివరాలు సరిగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99481 95654 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

సిబ్బంది సమస్యలు తెలుసుకున్న సీపీ



ఖలీల్‌వాడి: పోలీస్‌శాఖ సిబ్బంది తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువస్తే సత్వర చర్యలు తీసుకుంటామని సీపీ కల్మేశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో శనివారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి సమాజంలో పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు కోటేశ్వరరావు, బస్వారెడ్డి, ఆర్మూర్, బోధన్, స్పెషల్ బ్రాంచ్, ట్రాఫిక్, ఆర్మ్‌డ్ రిజర్వ్, సీసీఎస్, సీసీఆర్‌బీ ఏసీపీలు, సీఐలు, ఆర్‌ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

బోధన్‌రూరల్: మండలంలోని భవానీపేట్ శివారులో శనివారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేసినట్లు రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.



ధాన్యంలో చేరిన నీటిని తొలగిస్తున్న రైతు

వర్షానికి తడిసిన ధాన్యం

సిరికొండ: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చాక నీటిపాలవుతోంది. పంట కోసి ఆరబెట్టిన తర్వాత వర్షాలు పడుతుండటంతో అన్నదాతలు ఆగం అవుతున్నారు. సిరికొండ మండలంలోని రావుట్ల, న్యావనంది గ్రామాల్లో శనివారం వర్షం కురిసింది. దీంతో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. ఉదయం నుంచి ఎండ రావడంతో వడ్లు ఆరబోశామని, ఒక్కసారిగా వాన పడటంతో తడిసిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



న్యావనంది గ్రామంలో వర్షానికి తడిసిన ధాన్యం

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



కోదండరామ్‌ను సన్మానిస్తున్న జేఏసీ నాయకులు



మాట్లాడుతున్న జిల్లా జేఏసీ చైర్మన్ గోపాలశర్మ

నిజామాబాద్ అర్బన్: సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు కోరారు. ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన తరువాత తొలిసారి శనివారం జిల్లా కేంద్రానికి వచ్చిన కోదండరామ్‌ను జేఏసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రొఫెసర్ కోదండరామ్‌ను కలిసినవారిలో టీఎన్జీవో నాయకులు అలుక కిషన్, అమృత్‌కుమార్, నేతికుంట శేఖర్, చిట్టి నారాయణరెడ్డి, పోల శ్రీనివాస్, నాగరాజు, జాఫర్ హుస్సేన్, అతిక్, సంజీవయ్య, జాకీ హుస్సేన్, నిరంజన్‌గౌడ్, ఉమాకిరణ్ తదితరులున్నారు.

నేడు సన్మానం

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ సాధనకోసం ఉద్యమ స్ఫూర్తిని రగిలించి రాష్ట్ర సాధనలో ముందుండి జేఏసీని నడిపించిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు నగరంలోని టీఎన్జీవో భవన్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు సన్మానించనున్నట్లు జిల్లా జేఏసీ చైర్మన్ గోపాల శర్మ తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఏ ఒక్క పార్టీతో తెలంగాణ సాధ్యం కాదని మేధావులు, ఉద్యమ నాయకులు చర్చించి జేఏసీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఐక్యమత్యంతోనే తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామన్నారు. సమావేశంలో కన్వీనర్ గైని గంగారాం, అధికారప్రతినిధి ప్రభాకర్, కో కన్వీనర్ భాస్కర్, పీఎంపీ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ మోహన్, మైనార్టీ జేఏసీ నాయకుడు నజీర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో బంగారు పతకాలు



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాలలో నిర్వహించిన 42వ జాతీయ జూనియర్ సాఫ్ట్‌బాల్ ఫైనల్ మ్యాచ్‌లో తెలంగాణ రాష్ట్ర బాలికల జట్టు పంజాబ్ జట్టుపై 2–1 తేడాతో విజయం సాధించింది. రాష్ట్ర జట్టు విజయం సాధించడంలో నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల క్రీడాకారిణులు గోక సాత్విక, గోక శ్రావిక కీలకపాత్ర పోషించి బంగారు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. సాత్వికకు బెస్ట్ పిక్చర్ అవార్డు వచ్చిందన్నారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారిణులను ప్రిన్సిపాల్ నళిని, వైస్ ప్రిన్సిపల్ స్వప్న, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వనిత, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్రీలత, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ వేముల మౌనిక, ఉపాధ్యాయులు శనివారం సన్మానించి అభినందించారు.

కేశాపూర్ వాసికి డాక్టరేట్



నిజామాబాద్ రూరల్: మండలంలోని కేశాపూర్ గ్రామానికి చెందిన బొల్లవత్తి లోకేశ్వర్ తమిళనాడులోని అన్నమలై యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఈనెల 17వ తేదీన యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి.. లోకేశ్వర్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు.

ఉచితంగా విద్య అందించడం అభినందనీయం

నిజామాబాద్‌అర్బన్: కాకతీయ విద్యా సంస్థలో అనాథ పిల్లలకు ఉచితంగా విద్యనందించడం అభినందనీయమని జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. విద్యా సంస్థల అధినేత రజినీకాంత్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రణధీర్‌ను సైతం సన్మానించారు.



కాకతీయ విద్యా సంస్థల అధినేత రజినీకాంత్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి విద్యుత్ షాక్‌తో మృతి

నిజాంసాగర్(జుక్కల్): చేపలను వేటాడేందుకు వెళ్లిన వ్యక్తి విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి మహ్మద్‌నగర్ మండలం సింగితం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గువ్వ సాయిలు, గంగి మైశబోయి, చిట్యాల పెద్దసాయిలు ముగ్గురూ కలిసి ఇరవై రోజులుగా రాత్రి వేళల్లో చేపలను వేటాడుతున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి ముగ్గురూ కలిసి సింగితం గ్రామ శివారులోని కొత్త కుంట చెరువులో చేపల వేటకు వెళ్లారు. సమీపంలోని పంట చేనుకు అడవి పందుల నుంచి రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఇనుప కంచెను చేపలవేట కోసం తీశారు. విద్యుత్ షాక్ ఇచ్చి చేపలను వేటాడేందుకు కంచె వైరును చెరువులో వేసి దానికి సర్వీస్ వైర్ కనెక్షన్ ఇచ్చారు. చేపలను వేటాడుతున్న క్రమంలో వైరు గువ్వ సాయిలు(40)కు తగిలి చెరువులోనే చనిపోయాడు. భయాందోళనకు గురైన మైశబోయి, పెద్దసాయిలు అక్కడి నుంచి ఇంటికి జారుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నమైనా గువ్వ సాయిలు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చుట్టుపక్కల వెతికారు. ఇదిలా ఉండగా పెద్ద సాయిలు బాన్సువాడ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పంచనామ నిర్వహించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బాన్సువాడ పోలీసులు తెలిపా రు.మృతుడికి భార్య సుజాత,కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు ..



మనోజ్‌గౌడ్ (ఫైల్)

బీబీపేట: పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని మల్కాపూర్‌కు చెందిన ఆశిగారి మనోజ్‌గౌడ్(25) కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 14వ తేదీన పురుగులమందు తాగాడు. కుటుంబసభ్యులు వెంటనే అతడిని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఎల్లారెడ్డిటీకు తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువు వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం

ఎడపల్లి(బోధన్): మండలంలోని జాన్కంపేట్ సీటీసీ ముందున్న చెరువు వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై వంశీచందర్‌రెడ్డి శనివారం తెలిపారు. శనివారం సాయంత్రం జానకంపేట గ్రామానికి చెందిన మహేశ్ పోలీస్ స్టేషన్‌కి వచ్చి సీటీసీ ముందున్న చెరువులో మహిళా మృతదేహం ఉందని సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. మృతురాలి వయస్సు 55 నుంచి 60 ఏళ్లు ఉంటుందని, పూర్తి వివరాలకు ఎడపల్లి పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఎడపల్లి బ్రిడ్జి వద్ద కుళ్లిన స్థితిలో మరో మృతదేహం..

ఎడపల్లి మండల కేంద్రం శివారులోని బ్రిడ్జి వద్ద కుళ్లిన స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు ఎస్సై వంశీచందర్‌రెడ్డి శనివారం తెలిపారు. బ్రిడ్జి వద్ద మృతదేహం ఉన్నట్లు గ్రామానికి చెందిన బొల్లపల్లి రాజు శనివారం మధ్యాహ్నం గ్రామపంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్‌కు సమాచారం అందించాడన్నారు. సెక్రెటరీ ఫిర్యాదు మేరకు ఘటనాస్థలాన్ని పరిశీలించామని, గుర్తు తెలియని వ్యక్తి సుమారు 30 రోజుల క్రితం మృతి చెంది ఉంటాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఛాతి నొప్పి భరించలేక ..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన దొడ్లె దాస్‌గౌడ్(53) అనే వ్యక్తి ఛాతినొప్పి భరించలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కొడుకు, కూతురితో కలిసి హైదరాబాద్‌లో ఉంటు న్న దాస్‌గౌడ్ ఆరు సంవత్సరాలుగా ఛాతి, గుండెనొప్పితో బాధపడుతున్నారు. ఇప్పటికే రెండు స్టంట్‌లు వేశారు. అయినప్పటికీ ఛాతి నొప్పి వస్తుండడంతో జీవితంపై విరక్తి చెందిన ఆయన ఈ నెల 17వ తేదీన కుటుంబ సభ్యులకు చెప్పకుండా లింగంపేటకు వచ్చాడు.18వ తేదీన తన సొంత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికు మారుడు విశాల్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దమ్ముతో బాధపడుతున్న వ్యక్తి..

బీబీపేట: మండల కేంద్రానికి చెందిన నాగ్గారి చంద్రం(39) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. కొన్నేళ్లుగా గురక, దమ్ముతో బాధపడుతున్న చంద్రం ఆస్పత్రుల్లో చూయించుకున్నా తగ్గలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఇంటి ముందున్న జామ చెట్టుకు శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన జినగరి రాజు(46) శుక్రవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. నాలుగేళ్లుగా కామారెడ్డిలో సెంట్రింగ్ పని చేస్తున్న రాజు కల్లు, జూదానికి బానిసై అప్పులపాలయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది లింగంపేటలోని తన కూలిపోయిన ఇంటికి వచ్చి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య లావణ్య, ఇద్దరు కూతుళ్లు తనూజ, మేఘన ఉన్నారు.

కాళ్లు, కీళ్ల నొప్పులు భరించలేక వృద్ధురాలు..



రాజవ్వ మృతదేహం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామానికి చెందిన చెవిటి రాజవ్వ(78) అనే వృద్ధురాలు శనివారం కుంటలోదూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై కొండల్‌రెడ్డి తెలిపారు. గతరెండు సంవత్సరాలుగా కాళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న రాజవ్వకు కుటుంబ సభ్యులు వైద్యం చేయించారు. అయినప్పటికీ నొప్పులు తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన రాజవ్వ గ్రామశివారులోని మాలకుంటలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి నలుగురు కుమారులు ఉన్నారన్నారు. మూడో కుమారుడు బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్‌లు చోరీ

రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ సంతలో శనివారం రెండు సెల్ ఫోన్‌లు చోరీకి గురయ్యాయి. కూనేపల్లి, రెంజల్ గ్రామాలకు చెందిన ఇద్దరి ఫోన్‌లను దుండగులు కొట్టేశారు. ఆరు నెలల తరువాత మళ్లీ సంతలో చోరీలు ప్రారంభమయ్యాయని, పోలీసులు నిఘా పెట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు



సాటాపూర్ సంతలో కొనుగోలుదారులు

రెంజల్(బోధన్): కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. పేద, మధ్య తరగతి వర్గాలపై మోయలేని భారంపడుతోంది. కూరగాయల ధరలు అమాంతం పెరగడంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నా రు. శనివారం మండలంలోని సాటాపూర్‌లో నిర్వహించిన వారసంతకు వచ్చిన కొనుగోలుదారులు కూరగాయల ధరలు విని హడలెత్తిపోయారు. ఏది కొందామన్నా కిలోకి వంద రూపాయలకు తక్కువ లభించలేదు. కూరగాయలతోపాటు ఆకు కూరల ధరలదీ అదే పరిస్థితి. ప్రతి వంటకంలో వినియోగించే కొత్తిమీర ధర చుక్కలను తాకింది.

వ్యాపారులు నిర్ణయించిందే ధర

స్థానికంగా కూరగాయల పంటల సాగు లేకపోవడంతో పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి దిగుబడి చేస్తున్నా రు. అక్కడి రై తులతోపా టు ఎడపల్లి మండలం ఒడ్డాపల్లి గ్రామాని కి చెందిన గిరి జన మహిళలు తీసుకువస్తేనే మార్కెట్ సా గుతుంది. వ్యా పారులు సిండికేట్‌గా మారి ధరలను నిర్ణయిస్తున్నారు.

మార్కెట్‌లో కూరగాయల ధరల వివరాలు

కూరగాయలు	కిలోధర	కూరగాయలు	కిలోధర
టమాట	50	కాకరకాయ	100
బీరకాయ	120	పచ్చిమిర్చి	80
వంకాయ	80	దొండకాయ	60
బెండకాయ	100	ఉల్లిగడ్డ	50
చిక్కుడు	100	క్యాలీఫ్లవర్	80

ఏటీసీల పనులను వేగవంతం చేయాలి

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్ (ఏటీసీ) నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులకు సూచించారు. నిజామాబాద్ నగరంలోని శివాజీనగర్ ఉన్న ప్రభుత్వ బాలుర, బాలికల ఐటీఐ ప్రాంగణాల్లో కొనసాగుతున్న ఏటీసీ భవన సముదాయాల నిర్మాణ పనులను కలెక్టర్ శనివారం పరిశీలించారు. పనుల నాణ్యతను పరిశీలించిన కలెక్టర్.. ఎప్పటిలోగా పనులు పూర్తవుతాయని అధికారులను ప్రశ్నించగా, మరో మూడు నెలల్లో భవన సముదాయాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. వచ్చే వారం సంబంధిత శాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి సైతం నిర్మాణ పనుల పరిశీలనకు వచ్చే అవకాశాలు ఉన్నందున నాణ్యతతో యుద్ధప్రాతిపదికన పనులు జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కలెక్టర్ వెంట సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

షెడ్యూల్డ్ కులాలు, తెగల రక్షణ చట్టంపై అవగాహన

ఖలీల్‌వాడి: తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి వైజయంతి ఆదేశాల మేరకు శనివారం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని కోర్టుల్లో విధులు నిర్వర్తిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్ష నిర్వహించారు. నూతనంగా అమలులోకి వచ్చిన చట్టాలపై బాధితులకు అవగాహన కల్పించాలని, సాక్షులు సాక్ష్యం ఇవ్వడంలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల రక్షణ చట్టాల గురించి వివరించారు. అనంతరం నూతనంగా నియమితులైన జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి రాజేశ్వర్‌ని డిప్యూటీ డైరెక్టర్, ఉమ్మడి జిల్లాలోని ప్రాసిక్యూటర్లు సన్మానించారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాజారెడ్డి, బంటు వసంత్, శ్యాంరావు, నిమ్మ దామోదర్‌రెడ్డి, ఖాందేశ్ శ్రీనివాస్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జి రామకృష్ణ, ఎండీ రహీముద్దీన్, భూసారపు రాజేశ్‌గౌడ్, చిదిరాల రాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనర్సయ్య

ఆగని లక్కీ కాయిన్ ఆట

- ఎస్సారెస్పీ అడ్డాగా గ్యాంబ్లింగ్
- మోసపోతున్న అమాయకులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను కేంద్రంగా చేసుకుని లక్కీ కాయిన్, ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ ఆటలు జోరుగా సాగుతున్నాయి. అయినప్పటికీ పోలీసులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఎస్సారెస్పీ ఆనకట్టను కేంద్రంగా చేసుకుని కొన్ని రోజుల నుంచి దందా నడిపిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ చుట్టూ అడ్డాలు ఏర్పడ్డాయి. దీంతో సామాన్యులు మోసపోతూనే ఉన్నారు. శనివారం రోజున ప్రాజెక్ట్ ఎస్కేప్ గేట్ల వద్ద దర్జాగా లక్కీ కాయిన్ ఆటను కొనసాగించారు. ఈ ఆటలో నిమిషాల వ్యవధిలోనే అమాయకులు తమ డబ్బును పోగొట్టుకుంటున్నారు. ప్రాజెక్ట్ ఆనకట్ట, ఎస్కేప్ గేట్లు, ఆనకట్ట కింద, వరద కాలువ హెడ్ రెగ్యులేటర్ సమీపంలో ఎక్కడపడితే అక్కడ లక్కీ కాయిన్ ఆటను ఆడిపిస్తున్నారు. కనీసం మూడు నుంచి నాలుగు గ్యాంగ్‌లు ఈ ఆటను ఆడిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆర్మూర్, పెర్కిట్, నిర్మల్ పట్టణాల నుంచి వస్తున్న నిర్వాహకులు ఇక్కడ అడ్డాలు పెడుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి లక్కీ కాయిన్ కథను ముగించాలని పలువురు కోరుతున్నారు.



ప్రాజెక్ట్ ఎస్కేప్ గేట్ల వద్ద లక్కీకాయిన్ ఆట

మహిళపై గ్యాంగ్‌రేప్

- ఆటోలో డిచ్‌పల్లికి తీసుకువెళ్లి అఘాయిత్యం
- నలుగురిపై కేసు నమోదు
- మెడికల్ టెస్ట్‌లకు మహిళ తరలింపు

ఖలీల్‌వాడి: ఓ మహిళపై నలుగురు వ్యక్తులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్‌కు చెందిన మహిళ షాపింగ్ కోసం శుక్రవారం నిజామాబాద్‌కు వచ్చింది. అయితే రాత్రి కావడంతో నిజామాబాద్ బస్టాండ్‌కు వచ్చిన మహిళను బోధన్‌లో దింపేస్తానని చెప్పి ఓ వ్యక్తి ఆటోలో ఎక్కించుకున్నాడు. ఆటోను బోధన్ వైపు కాకుండా డిచ్‌పల్లి వైపు ఆటోను తీసుకువెళ్లగా, అక్కడికి మరో ముగ్గురు చేరుకున్నారు. నలుగురు వ్యక్తులు మహిళను రేప్ చేసి అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. బాధితురాలు శనివారం ఉదయం నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. బాధితురాలిని ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, స్థానిక పోలీసులు ఘటనాస్థలానికి తీసుకెళ్లి విచారణ చేపట్టారు. అనంతరం సదరు మహిళను మెడికల్ పరీక్షలకు పంపించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు డిచ్‌పల్లికి చెందిన మోసిన్, నగేశ్, జైనొద్దీన్, సుల్తాన్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బస్టాండ్‌లోని సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు.

చోరీ కేసులో నిందితుల రిమాండ్

గాంధారి(ఎల్లారెడ్డి): చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను శనివారం ఆయన వెల్లడించారు. మండలంలోని జువ్వాడి గ్రామానికి చెందిన వడ్ల పండరి ఇటీవల తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వేరే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. విషయం తెలుసుకుని అదే గ్రామానికి చెందిన పండరి దగ్గరి బంధువులు వడ్ల రాకేశ్, వడ్ల శ్రీకాంత్ దాబా పైనుంచి ఇంట్లోకి ప్రవేశించి రాగి, ఇత్తడి వస్తువులు ఎత్తుకెళ్లారు. మండల కేంద్రంలోని ఓ స్టీల్ దుకాణంలో శనివారం విక్రయించేందుకు రాగా, అనుమానంతో దుకాణం యజమాని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు దుకాణానికి ఇద్దరిని అదుపులోకి తీసుకుని వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై ఆంజనేయులు

ఒకరి అదృశ్యం



చింతల సాయిలు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని దుర్గానగర్ కాలనీకి చెందిన చింతల సాయిలు అదృశ్యమైనట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన సాయిలు తిరిగి రాలేదని, ఆయన ఆచూకీ లభించకపోవడంతో భార్య మరియమ్మ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.